## చిన్నకథ

# ఇందిరా రమణీయం



ఆయనపేరు వెంకటరమణ. పత్రికా సంపాదకుడు. ఆవిడ పేరు ఇందిర. గృహిణి.

ఒక రోజు ఉదయం..

''ఇందిరా''

''వస్తున్నానండి''

''ఇక్కడ పుస్తకం పెట్టాను. చూసావా?''

''ఏదీ. ఆ ఎర్ర అట్ట ఉన్న పుస్తకమేనా?''

''ఎర్ర అట్ట, పచ్చ అట్ట ఏంటి ఇందిరా? పుస్తకం పేరు చూడొచ్చు కదా?''

''నిజమే కానీ పుస్తకం పేరు చదవాలంటే కాస్త టైము పడుతుంది. అట్ట రంగు అయితే చూడగానే తెలుస్తుంది''

''ఇంతకీ ఆ పుస్తకం ఎక్కడ పెట్టావ్''

''మీరు ఎక్కడ పడితే అక్కడ పుస్తకాలు పరిచి వదిలేస్తుంటారు. సర్దుదామని తీసాను. ఆ పుస్తకాల షెల్ఫులో పెట్టాను చూడండి''

''స్నానం చేసి వచ్చి సగం చదివిన బుక్ పూర్తి చేయాలనుకున్నాను. ఇక చదవటం కుదరదులే. ఇంతకీ ఈ పూట టిఫిన్ ఏమిటి?''

''పెసరట్టు, ఉప్మా''

''రెండూ ఆయిల్ అయిటమ్స్ కదా! కొంచెం మార్చక పోయావా?''

''ఈ కాంబినేషను బావుంటుందని''

''బాగానే ఉంటుంది కాని మొన్న మా చెల్లెలు వాళ్లింటికి వెళ్లితే 'పెసర మొలకలు' పెట్టింది. అవి కూడా బాగానే ఉన్నాయి. మధ్య మధ్యలో నువ్వు కూడా అలా చెయ్యొచ్చు కదా!''

''పొద్దున పూట మొలకలు ఏమిటండీ. చప్పగా ఉంటాయి. టిఫిన్ బదులు తినగలమా! మీ చెల్లెలిది అంతా పొదుపు. నూనె ఖర్చు అవుతుందని అన్నీ అలాంటివి చేస్తారు. మొన్న ఆ మధ్య మీ బావగారు వచ్చినప్పుడు మనింట్లో పెసరట్టు, ఉప్మా తింటూ ఏమన్నారో చూసారుగా. మా యింట్లో గింజలు, పళ్లు తిని నోరు చవి చచ్చిపోయింది చెల్లెమ్మా. నీ చేతి టిఫిన్ చాలా బావుందని అనలా''

''అన్నారా. నాకు గుర్తు లేదులే. ఈసారి ఆయన వచ్చినప్పుడు అవే చేసిపెట్టు. ముందు నా టిఫిన్ సంగతి చూడు. ఆఫీసుకి టయిమయిపోతోంది''

''ఎంత నిమిషంలో చేస్తాను కాని ఒక సంగతి చెప్పండి. ఆ మధ్య మీ చెల్లెలు మనింటికొచ్చినప్పుడు వదినా మా అన్నయ్యకి 'నయన హింస' పెట్టొద్దు అన్నారు. అంటే ఏమిటండీ''

''అంటే నువ్వేమనుకున్నావ్''

''ఆరోజు ముదురు రంగు పెద్ద పెద్ద పువ్వులున్న చీరకట్టుకున్నాను. అది బాగోలేదని అనుకుంటున్నాను''

''అంతేలే'' అన్నాడాయన నవ్వాపుకుంటూ.

''నయన హింస అంటే ఏమిటొదినా'' అని కూడా అన్నారు.

''అంటే నీకు కోపం వచ్చిందా?''

''లేదు ఆవిడ సరదాకి ఆట పట్టిస్తుందని తెలుసు''

''తెలుసు కదా. అర్థం చేసుకున్నావులే'' అన్నాడాయన ముసిముసిగా నవ్వుకుంటూ.

''మీ చెల్లెలికెప్పుడూ నన్ను చూస్తే వేళాకోళమే''

''ఇంకేమంది''

''ఎప్పుడో పదిహేనేళ్లక్రితం మన పెళ్ళయిన కొత్తలో 'దుర్యోధనుడు, ధృతరాష్ట్రుడు, ధర్మరాజు పాండవుల పేర్లు తెలుసుకొని సుయోధనుడంటే ఎవరొదినా' అని అడిగాను. అంతేనండి. ఎంతసేపు నవ్వారో, తలచుకుని తలచుకుని పడీపడీ నవ్వారు''

పత్రికా సంపాదకుల వారికి నవ్వాగటం లేదు. పొరలు పొరలుగా ఎంత ఆపుకున్నా ఆగకుండా పొట్ట పట్టుకుని నవ్వుతున్నారు.

సతీమణి విచిత్రంగా చూస్తోంది.

''ఎందుకండీ అంత నవ్వు?''

''ఇంత చిన్న విషయం కూడా తెలియలేదా! ఇప్పటికైనా తెలిసిందా?''

''నాకెలా తెలుస్తుందండీ. నా చిన్నప్పుడే మా అమ్మ చనిపోతే మా అమ్మని తలచుకుంటూ బాధతో నన్ను పెంచి పెద్ద చేసి పెళ్లి చేసారు మాతాత అమ్మమ్మ. నాకీ సంగతులు ఎవరు చెపుతారు. సుయోధనుడంటే దుర్యోధనుడే నంట కదా! అయినా ఈ సంగతి తెలియకపోతే వచ్చే నష్టమేముంది. వేళకి భర్తకి, పిల్లలకి శుభ్రంగా వండి పెడ్తూ ఇల్లంతా నీట్‌గా ఉంచుకోవాలి కాని ఈ పురాణాల గొడవ ఎందుకు? ఏం కలిసొస్తుంది'' అనుకుంటూ టిఫిన్ తేవటానికి వంటింట్లోకి వెళ్లింది ఇందిర.

జాతీయ, అంతర్జాతీయ విషయాలు అవలోకిస్తూ, ఆలోచిస్తూ 'సమాజానికి ఏ విధంగా మంచి జరుగుతుందా' అని నిరంతరం తపన పడుతూ అధ్యయనంలో మునిగి తేలే వెంకటరమణగారు క్షణకాలం విభ్రాంతికి లోనయ్యారు, భార్యామణి మాటలకు.

– సి. భారతి